సాక్షి

# నగరాల సుస్థిరాభివృద్ధిలో ఐఐటీలది ప్రధాన భూమిక

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



**సాక్షి, సిటీబ్యూరో:** నగరాలు స్థిరమైన అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వం, పారిశ్రామిక రంగం, పరిశోధనా సంస్థలు ఉమ్మడి ప్రణాళికతో ముందుకు రావాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ఈ ప్రయత్నంలో ఐఐటీలు ఇతోధికంగా తమ పరిజ్ఞానాన్ని, ఆలోచనలను పంచుకోవాలని సూచించారు. ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థులు, ప్రొఫెసర్లు 'సస్టైనబుల్ అండ్ గ్రీన్ సిటీస్' అనే అంశంపై నగరంలో నిర్వహించిన సమావేశంలో మెట్రో ఎండీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో ఐఐటీ పూర్వ విద్యార్థులై వివిధ స్టార్టప్‌లు, పరిశ్రమలకు చెందిన సీఈఓలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. సామాన్య ప్రజల సమస్యలకు పరిష్కారం లభించేలా సాంకేతిక ఆవిష్కరణలు జరగాలన్నారు. ఇందుకోసం ఐఐటీలు ప్రధాన భూమిక పోషించాలని సూచించారు. ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ హైదరాబాద్ మెట్రో రైల్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచంలోనే ఇతర ప్రధాన నగరాలకు పోటీపడే విధంగా రూపొందించినట్లు చెప్పారు. హైదరాబాద్ మెట్రో ఇప్పటి వరకు 350కి పైగా ప్రతిష్టాత్మక అవార్డులను సాధించిందన్నారు. ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి వర్చువల్‌గా ప్రసంగించారు. ప్రొఫెసర్ అశ్విన్ మహాలింగం, ప్రొఫెసర్ మనూ సంతానం, ప్రొఫెసర్ గీతాకృష్ణన్, పలువురు ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.